వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 199    గురువారం | 08 ఫిబ్రవరి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



8లో

## రాజ్యసభలో అడుగు పెట్టడం నా అదృష్టం..!

ఇదంతా కేసీఆర్ వల్లే సాధ్యమైంది

మరో అవకాశం ఇస్తే.. మళ్లీ మీ ముందుకు

ఎంపీ వద్దిరాజు వీడ్కోలు ఉపన్యాసం

ఉర్సు రంగ సముద్రం

# గుర్రపుడెక్క.. తొలగేదెట్లా..?



వివరాలు 2లో..

**పచ్చిక బయళ్లను తలపిస్తున్న చెరువులు**

**కలుషితమవుతున్న నీరు**

**రూపంలేని లేక్ ప్రొటెక్షన్ కమిటీ**

**అలంకారప్రాయంగా మారిన ఫ్లొటింగ్ ట్రాష్ కలెక్టర్**

**రూ.40లక్షలు వృథా**

నగరంలోని ప్రధాన చెరువులన్నీ గుర్రపు డెక్కతో నిండిపోయి పచ్చిక బయళ్లను తలపిస్తున్నాయి. రోజు రోజుకూ విస్తరిస్తున్న గుర్రపు డెక్కతో దోమలు విస్తృతంగా వ్యాప్తి చెంది నగర వాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చెరువు పరిసర ప్రాంతాల్లో జీవించే నిరుపేదలు దోమ కాటుకు గురై రోగాలబారిన పడుతున్నారు. చెరువుల్లోని నీరు కలుషితంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. చెరువు పరిసర ప్రాంతాల్లోని భూగర్భ జలాలు సైతం విషతుల్యంగా మారుతున్నాయి. సమీపంలోని కాలనీ బోరు బావులనుంచి మురుగునీరు వస్తోంది. మునిసిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో పనిచేయాల్సిన లేక్ ప్రొటెక్షన్ కమిటీని నీరుగార్చారు. గత మూడు సంవత్సరాలుగా లేక్ ప్రొటెక్షన్ కమిటీ అన్న ఊసే లేకుండా చేశారు. బల్దియా నిర్వహించిన గ్రీవెన్స్‌లో గుర్రపు డెక్కను తొలగించాలంటూ గత మూడు నెలల్లోనే ఎనిమిది సార్లు ఫిర్యాదులు అందాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. గుర్రపు డెక్క తొలగించేందుకు రూ.40లక్షలతో కొనుగోలు చేసిన ఫ్లొటింగ్ ట్రాష్ కలెక్టర్‌తో రెండు నెలల్లో నగరంలోని చెరువులను శుద్ధి చేస్తామన్న మేయర్ సుధారాణి మాటలు నీటి మూటలుగా మారాయి. - వరంగల్ వాయిస్, వరంగల్



'గుర్రపు డెక్కను తొలగించేందుకు ఫ్లొటింగ్ ట్రాష్ కలెక్టర్ కొనుగోలు చేస్తున్నాం..రెండు నెలల్లో నగరంలోని అన్ని చెరువుల్లో విస్తరించిన గుర్రపు డెక్కను తొలగించి నీరు కలుషితం కాకుండా కాపాడుతా' అంటూ మేయర్ గుండు సుధారాణి హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు కావస్తోంది. గుర్రపుడెక్క తొలగింపు కాదుకదా అది మరింత విస్తరించింది. కొనుగోలు చేసిన యంత్రం దిష్టి బొమ్మలా దర్శనమిస్తోంది.




8లో..

## భారత సంస్కృతికి ప్రతీక కుస్తీ

హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఉత్సాహంగా రెజ్లింగ్ పోటీలు

## మేడారం జాతరకు సీఎం రేవంత్

### పటిష్ట భద్రత ఏర్పాట్లు



తెలంగాణ కుంభమేళగా కీర్తి గడించిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నారు. ఈ నెల 21నుంచి 24 వరకు నాలుగు రోజుల పాటు జాతర నిర్వహించనున్నారు. సీఎం రాక సందర్భంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు గురువారం మేడారంలోని హరిత హొటల్ లో జరిగిన'మీడియా ఇంటరాక్షన్' కార్యక్రమంలో ములుగు ఎస్పీ శబరిష్ ప్రకటించారు. - వరంగల్ వాయిస్, వరంగల్



8లో

## 14న లక్నవరం నీరు విడుదల

గిరిజన సాంప్రదాయాలతోనే మేడారం జాతర

అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి


కోట చెరువు

# గుర్రపు డెక్క.. తొలగేదెట్లా..?


భద్రకాళి చెరువు


చిన్న వడ్డేపెల్లి చెరువు

**పచ్చిక బయళ్లను తలపిస్తున్న చెరువులు**

**కలుషితమవుతున్న నీరు**

**రూపంలేని లేక్ ప్రొటెక్షన్ కమిటీ**

**అలంకారప్రాయంగా మారిన ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్**

**రూ.40 లక్షలు వృథా**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని చెరువుల్లో రోజు రోజుకూ విస్తరిస్తున్న గుర్రపు డెక్కతో నీరు కలుషితం కావడంతోపాటు చుట్టు పక్కల ప్రాంతాలు విషతుల్యంగా మారుతున్నాయి. దీంతో గుర్రపు డెక్కను తొలగించేందుకు నగర మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన గ్రేటర్ పాలకవర్గం నడుం భిగించింది. మాన్యువల్ గా దీనిని తొలగిస్తే ఎక్కువ ఖర్చు అవుతుందని భావించిన పాలకవర్గం సుమారు రూ.40 లక్షలతో గుర్రపు డెక్కను తొలగించేందుకు ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్ ను కొనుగోలు చేసేందుకు నిర్ణయించింది. ఇది వచ్చిన రెండు నెలల్లోనే గ్రేటర్ పరిధిలోని అన్ని చెరువుల్లో విస్తరించిన గుర్రపు డెక్కను తొలగించి విషతుల్యంగా మారుతున్న చెరువులను రక్షిస్తామంటూ మేయర్ ప్రకటించారు.

## మూన్నాళ్ల ముచ్చటే..

గుర్రపు డెక్కను తొలగించేందుకు రెండు సంవత్సరాల క్రితం రూ.40 లక్షలతో ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్ ను కొనుగోలు చేశారు. దీనిని ప్రయోగాత్మకంగా వడ్డెపెల్లి చెరువులో పరిశీలించారు. త్వరలోనే నగరంలోని భద్రకాళి చెరువు, చిన్న వడ్డెపెల్లి చెరువు, మట్టెవాడ కోట చెరువు, ఉర్సు రంగ సముంద్రం, కట్ట మల్లన్న చెరువుల్లోని గుర్రపు డెక్కను తొలగిస్తామంటూ బల్దియా అధికారులు ప్రకటించారు. అయితే ఇది మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. వడ్డెపెల్లి చెరువులోని గుర్రపె డెక్కను తొలగిస్తున్న సమయంలో మరమ్మతులకు వచ్చింది. ఏదో విధంగా అక్కడ మమా అనిపించి ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్ ను భద్రకాళి చెరువుకు తరలించారు. ఇక అప్పటినుంచి అది అలంకార ప్రాయంగా మారింది. భద్రకాళి ట్యాంక్ బండ్ పై బోటింగ్ చేసేందుకు వచ్చిన వారికి దిష్టిబొమ్మగా దర్శనమిస్తోంది.

## ప్రజా ధనం వృథా..

గతంలో మాన్యువల్ గానే గుర్రపు డెక్కను తొలగించేవారు. ఇందులో చెరువు కమిటీని బాధ్యులుగా చేసేవారు. నిత్యం చెరువుల్లో చేపలు పట్టుకునే వారి సహాయ సహకారాలతో గుర్రపె డెక్క కనిపించకుండా చేసేవారు. ఈ బాధ్యతను బల్దియా అధికారులే చూసేవారు. అయితే పని ఖచ్చితంగా, త్వరితంగా పూర్తి చేయాలన్న తలంపుతో గ్రేటర్ అధికారులు రూ.40 లక్షలతో ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్ ను కొనుగోలు చేసినా అది ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు. దీంతో ప్రజా ధనం దుర్వినియోగం అయిందన్న భావన ప్రజలనుంచి వ్యక్తమవుతోంది.

## గుర్రపు డెక్కను తొలగించండి..

నగరంలోని చెరువుల్లో రోజు రోజుకు విస్తరిస్తున్న గుర్రపు డెక్కను తొలగించాలన్న అభిప్రాయం గత కొంత కాలంగా వ్యక్తమవుతోంది. ఈ విషయంలో బల్దియా అధికారులు కాలయాపన చేస్తూ వస్తున్నారు. చెరువుల పరిసరాలు విషతుల్యంగా మారుతున్నాయన్న తలంపుతో బల్దియాలో నిర్వహించిన గ్రీవెన్స్ లో గత మూడు నెలల్లోనే ఎనిమిది సార్లు ఫిర్యాదులు అందాయి. అయితే ఫిర్యాదులకు పరిష్కార మార్గాలు చూపించాల్సిన అధికారులు ప్రజల దృష్టిని మరల్చేందుకే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఎక్కడ..?

గతంలో చెరువుల పరిరక్షణకు గ్రేటర్ వరంగల్ కమిషనర్ అధ్యక్షతన లేక్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటు చేసేవారు. ఇందులో జిల్లా కలెక్టర్ తోపాటు పోలీస్ ఉన్నతాధికారులు, సామాజిక కార్యకర్తలు సభ్యులుగా ఉండేవారు. వారు ప్రతి ఆరు నెలలకు ఒక సారి సమావేశం నిర్వహించి ఆక్రమణకు గురవుతున్న చెరువుల పరిరక్షణకు కృషి చేసేవారు. అదే విధంగా చెరువుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించే వారు. దీనికి కావాల్సిన నిధులను కార్పొరేషన్ నుంచి సర్దుబాటు చేసేవారు. అయితే గత మూడు సంవత్సరాలుగా లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఊసే లేకుండా చేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొంత మంది బడా బాబులు కుమ్మకై చెరువులు ఆక్రమించుకునేందుకు లేక్ ప్రొటెక్షన్ కమిటీ నామరూపాలు లేకుండా చేశారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి చెరువుల్లోని గుర్రపు డెక్కను తొలగించి నగర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.


భద్రకాళి చెరువులో నిరుపయోగంగా ఉన్న ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్

## అక్రమంగా కేసు పెట్టారు..

**- పెరుమాళ్ల లక్ష్మణ్,**
**చిన్న వడ్డెపెల్లి చెరువు పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు**



చెరువుల్లోని గుర్రపు డెక్కను తొలగించాలని గత మూడు నెలల్లో ఎనిమిది సార్లు బల్దియాలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా కమిషనర్ స్పందించలేదు. సోమవారం కూడా మరోసారి ఫిర్యాదు చేసేందుకు గ్రీవెన్స్‌కు వెళ్లగా సమస్యను పక్కదోవ పట్టించేందుకే నాపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీస్ కేసు పెట్టారు. ప్రజా సమస్యాలపై ఫిర్యాదు చేస్తే వాటిని పరిష్కరించకుండా అక్రమంగా కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికే విరుద్ధం.

# ఆరోగ్య భారత్ మోడీ సర్కార్ లక్ష్యం

## బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆరోగ్య భారత్ నిర్మాణానికి మోడీ సర్కార్ పెద్ద పీట వేస్తోందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. గురువారం వరంగల్ ఎంజీఎంలో నషా ముక్త్ భారత్ అభియాన్ మద్యం, మాదక ద్రవ్యాల బాధితుల చికిత్స కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ వర్చువల్ గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గంట రవికుమార్ మాట్లాడుతూ మోడీ సర్కార్ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు నిధులు కేటాయిస్తోందని చెప్పారు. ప్రజల ఆరోగ్యం బాగుంటే, దేశ ప్రగతి బాగుటుందని అందుకే ప్రధాని మోడీ ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తున్నారన్నారు. కేంద్రం ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 41 మద్యం, మాదక ద్రవ్యాల బాధితుల చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా అందులో మన వరంగల్ కు ఒక కేంద్రం రావడం హర్షణీయమన్నారు. వరంగల్ జిల్లాలో బీజేపి ఎమ్మెల్యే, ఎంపీలు లేకున్నా ప్రజల ఆరోగ్యం కోసం సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ అనే నినాదంతో నిధులు కేటాయిస్తున్నారని, ఇదీ ప్రజలు గమనించాలని గంట రవికుమార్ కోరారు. గతంలో హృదయ్ పథకంలో గ్రేటర్ వరంగల్ ను అభివృద్ధి చేశారని, నేడు ఎంజీఎంలో కోట్ల రూపాయలు వెచ్చించి మద్యం, మాదక ద్రవ్యాల బాధితుల చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశారని, దీన్ని ఓరుగల్లు ప్రజలు గమనించాలన్నారు. మద్యం, మాదక ద్రవ్యాల బాధితులకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతోపాటు, ఆర్థిక బారం పడుకూదనే ఆలోచనతో ఈ కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ కేంద్రాల్లో మద్యం, మత్తుకు బానిసలైన వారికి కౌన్సెలింగ్ తో పాటు చికిత్స అందిచనున్నారని చెప్పారు. కార్యక్రమంలో బిజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడలు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కందిమల్ల మహేష్, డివిజన్ ప్రెసిడెంట్ సుతారి గోపి, జెట్లింగ్ కిషోర్ షా, అకినే సాగర్, చంద్రమోహన్, లక్ష్మణ్, బీజేపీ మంద శ్రీనివాస్, ఎండీ రఫీ, భరత్, ఆకాష్, బీజేపీ అభిమానులు పాల్గొన్నారు.

# అంతర్ రాష్ట్ర దొంగల అరెస్ట్

## 12 తులాల బంగారం, 53 తులాల వెండి, బైకు స్వాధీనం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలో ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం పట్టణంలోని వివేకానంద సెంటర్ వద్ద పోలీసులు వెహికల్ చెకింగ్ చేస్తుండగా ఒక పల్సర్ బైక పై ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా వస్తుండగా వారిని పట్టుకొని విచారించగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యానంబైలుకు చెందిన పొన్నాల శివశంకర్, మహబూబాబాద్ జిల్లా అనంతారంకు చెందిన ఎడ్ల సుమన్ గా తెలిసింది. ఈ ఇరువురు కన్నా రేణుకతో కలిసి గత కొద్ది రోజుల నుంచి కొత్తగూడెం, మహబూబాబాద్, మహబూబాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలలో పలు దొంగతనాలు పాల్పడినట్లు తెలిపారు. అలా దొంగతనం చేసిన వాటిని వరంగల్ లో అమ్మిందుకు దొంగతనం చేసిన పల్సర్ బండిపై వెళుతుండగా పట్టుబడినట్లు తెలిపారు. మరో నిందితురాలు కన్నా రేణుక పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 12 తులాల బంగారం, 53 తులాల వెండి వస్తువులు, పల్సర్ బైకు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులలో నిందితులను చాకచక్యంగా పట్టుకున్న రూరల్ సీఐ, మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ ఇంచార్జి బి.రమేష్, ఎస్ఐ రామారావు, సిబ్బందిని వారి సిబ్బందిని రివార్డులతో అభినందించారు.

# బాల్క సుమన్‌పై సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దూషించిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ వరంగల్ నుంచి సీనియర్ న్యాయవాది నిమ్మాని శేఖర్ రావు, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్కుర్తి ఆనంద్ మోహన్ ఆధ్వర్యంలో సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో ఇదే నెల 5న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ముఖ్యమంత్రిని తీవ్ర పదజాలంతో దూషిస్తూ చెప్పులు పైకెత్తి చెప్పుతో కొడతా అంటూ బహిరంగంగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారమైంది . ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రిని దూషించడం, పబ్లిక్ గా దూషించినందున ముఖ్యమంత్రి ఇమేజ్ ను దెబ్బతీయడం పబ్లిక్ గా దాడి చేసే విధంగా మాట్లాడడం, బెదిరించే విధంగా మాట్లాడడం మొదలగు క్రిమినల్ చర్యలకు పాల్పడినందున బాల్క సుమన్ పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని న్యాయవాదులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు . ఫిర్యాదు స్వీకరించిన స్టేషన్ హౌస్ ఆఫీసర్ మహమ్మద్ సుకూర్ బాల్క సుమన్ పై కేస్ నమోదు చేయడం జరిగింది. ఫిర్యాదు చేసిన వారిలో న్యాయవాదులు సామంతల శ్రీనివాస్, గునిగంటి శ్రీనివాస్ గౌడ్, తీగల జీవన్ గౌడ్ , పోతురాజు రవి, సీహెచ్ రవికుమార్, గన్ను హరిహర కుమార్, పిల్లి కార్తీక్, సాయిని నరేందర్, చింతా నిఖిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

# బొడ్రాయి ప్రతిష్ఠ పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రంగశాయిపేటలో 11 నుంచి 14 వరకు నిర్వహించే బొడ్రాయి ప్రతిష్ఠ పోస్టర్ ను మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కమిటి సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చలో గావ్ అభియాన్ వర్క్ షాప్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గావ్ చలో అభియాన్ (పల్లె కి పోదాం పదండి) కార్యక్రమంలో భాగంగా గురువారం వరంగల్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్, దేశాయ్ పేట రోడ్డులో గల బీజేపీ స్థానిక కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశంలో పాల్గొని దిశా నిర్దేశం చేశారు. గావ్ చలో అభియాన్ ఇంచార్జి వన్నాల వెంకటరమణ అధ్యక్షతన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శక్తి వందన్ ప్రభారీ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి టి.కృష్ణ ప్రసాద్ హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూదేశ ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టిన పథకాలను గ్రామ స్థాయిలో, బూత్ స్థాయిలో మండల, డివిజన్, బూత్ అధ్యక్షులతో కలిసి ప్రజలకు తెలియచేయాలన్నారు. వచ్చే పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలిచే విధంగా కార్యకర్తలు పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, అసెంబ్లీ కన్వీనర్ పొట్టి శ్రీనివాస్ గుప్తా, బీజేపీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, డివిజన్ అధ్యక్షులు, పలు మోర్చా అధ్యక్షులు, నాయకులు, చలోగావ్ అభియాన్ ప్రవాసి కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

## స్పెషల్ ఆఫీసర్ తుమ్మ వెంకటేశ్వర్లు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అని, మన చుట్టూ ఉన్న పరిసరాలన్నింటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అమ్మాపురం గ్రామ స్పెషల్ ఆఫీసర్ తుమ్మ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజా పాలన రెండో రోజు కార్యక్రమంలో భాగంగా గురువారం అమ్మాపురం పాఠశాలలో ఏర్పాటుచేసిన శ్రమదాన కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మాట్లాడుతూ పాఠశాలతో పాటు గ్రామంలోని ప్రతి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అందుకు గ్రామ అధికారులు, యువకులు, మహిళలు ముందు వరసలో నిలవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జక్క శ్రావణి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ మురళీకృష్ణ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గూడెల్లి యాకయ్య, అంగన్వాడీ టీచర్లు కవిత, సరోజన, అలివేలు, పద్మ, ఆశా వర్కర్ ఉపేంద్ర, మహిళలు శోభ, సైదమ్మ, విజయ ధనమ్మ, ఎల్లమ్మ, వివోఏలు మమత, మాధవి, రాధిక గ్రామ పంచాయతీ సిబ్బంది యాకయ్య, సుమలత, సుభద్ర, అశోక్, ఉప్పలయ్య, వెంకటయ్య, సురేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి వాకర్స్ నూతన కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం ఎస్డీఎల్సీఈ ప్రగతి వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం విశ్వవిద్యాలయంలోని ఎస్డీఎల్సీఈ మైదానంలో జరిగిన సమావేశంలో వాకర్స్ ఇంటర్నేషనల్ చీఫ్ కోఆర్డినేటర్ దేశిని లక్ష్మీనారాయణ అధ్వర్యంలో కేయూ ఎస్డీఎల్సీఈ ప్రగతి వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కమిటీకి అధ్యక్షుడిగా డాక్టర్ నల్లాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గొడిశాల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా బుర్ర రమేష్, దేవర యాదగిరి, సహాయ కార్యదర్శులుగా గంద్ర రఘుపతి రెడ్డి, డాక్టర్ బిల్లకంటి మహేందర్ రావు, సంయుక్త కార్యదర్శులుగా బండి మహేందర్, తాళ్లపెల్లి రామకృష్ణ, కోశాధికారిగా సత్యనారాయణ, గౌరవ అధక్షుడిగా దేశిని లక్ష్మీనారాయణ, క్రీడలు, సాంస్కృతిక కన్వీనర్ గా రావుల వెంకటరెడ్డి, కో కన్వీనర్ గా దయాకర్ రెడ్డి, ప్రచార కార్యదర్శులుగా ఓదెల రాజేంద్రప్రసాద్, ముఖ్య సలహాదారులుగా డాక్టర్ సంగని మల్లేశ్వర్, డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, లీగల్ అడ్వైజర్, ముఖ్య సలహాదారులుగా బింగి సత్యనారాయణ, ప్రత్యేక ఆహ్వానితులుగా దగ్గుల శంకర్, డాక్టర్ పూజారి సుభాష్, డాక్టర్ వంగల జగన్, జాలి వాకర్ గా సుదర్శన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ రమేష్ రెడ్డి, హనుమంతరావు, ముకుంద రెడ్డి, బచ్చు ఆనందం, వి.సతీష్ కుమార్, పూజారి మనోజ్, పెండ్యాల కొమురయ్య, భూక్య బిక్కు ఎన్నికైనట్లు దేశిని లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేయూ స్పోర్ట్స్ సెక్రెటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య, ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, డాక్టర్ ఆశీర్వాదం, కేయూ ఎన్ జీఓ సంఘం పూర్వ అధ్యక్షుడు బాషపల్లి చొక్కారావు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని పలువురు అభినందించారు. వాకర్స్ సంక్షేమానికి కట్టుబడి పని చేస్తామని నూతన కమిటీ అభిప్రాయ పడింది.

# దేశ్‌కి బచావో్-మోడీకి హటావో్

## 16న దేశ వ్యాప్త సమ్మె, బంద్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఎన్ డీఏ నాయకత్వంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాల ఫలితంగా దేశం ప్రమాదంలో పడిందని, దేశాన్ని రక్షించుకోవడం కోసమే ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్ జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా జయప్రదం చేయాలని అఖిల పక్ష రాజకీయ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా సదస్సు తీర్మానం చేసింది. హనుమకొండలోని రాంనగర్ సుందరయ్య భవన్ లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సారంపల్లి వాసుదేవరెడ్డి అధ్యక్షతన జిల్లా సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం కన్వీనర్ బొట్ల చక్రపాణి, ఎంసీపీఐ జిల్లా నాయకులు హంసారెడ్డి, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు బాలరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఐఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు కూర వెంకటేశ్వర్లు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రాములు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం చుక్కయ్య, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి కర్రె లక్ష్మణ్, టీఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం శ్యాంసుందర్, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మద్దేల ఎల్లేష్, ఏఐసీటీయూ జిల్లా కన్వీనర్ ఎమ్మెస్ రావులు సమ్మె ప్రాధాన్యతను వివరిస్తూ సంపద సృష్టికర్తలుగా ఉన్న కార్మికులు, రైతులు కలిసి చేస్తున్న సమ్మె గా ఈ సమ్మె ఉంటుందని తెలిపారు. గ్రామీణ భారత్ బంద్ సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వంలో జరుగుతుందని, కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వంలో పారిశ్రామిక బంద్, సమ్మెను కార్మిక వర్గం చేస్తున్నదని అన్నారు. రైతాంగ ఉనికికే నష్టం చేసే మూడు నల్ల వ్యవసాయ చట్టాలను సుదీర్ఘ పోరాటాలతో రద్దైనా, దొడ్డి దారిన అమలు చేస్తున్నారని, రైతాంగ భూములను కార్పొరేట్లకు అప్పగించే పని చేస్తున్నారని, రైతుల పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించడం లేదని, ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. పదేళ్ల మోడీ పాలనలో కార్పొరేట్ మత విధానాలను అమలు చేస్తూ, దేశాన్ని అత్యంత ప్రమాదంలోకి తీసుకెళ్తున్నారని దుయ్యబట్టారు. ఈ దుర్మార్గ విధానాల నుంచి దేశాన్ని రక్షించుకోవడానికి ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త సమ్మె చేస్తున్నామని, ఈ సమ్మెతో దేశాన్ని రక్షించుకుందామంటూ, మోడీని గద్దె దింపుతామంటూ ప్రతిన బూనాలని పిలుపునిచ్చారు. సదస్సులో పలు తీర్మానాలు చేశారు. ఈనెల 9 నుంచి లక్ష సంతకాల సేకరణ, 14న వేయి స్తంభాల గుడి నుంచి కలెక్టరేట్ వరకు ద్విచక్ర వాహనాల ర్యాలీ, హనుమకొండలోని ఏకశిలా పార్కు నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన, కలెక్టరేట్ ఎదుట ధర్నా, ఈనెల 16న మండల కేంద్రాలలో ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో కార్మిక రైతు నాయకులు గాదె ప్రభాకర్ రెడ్డి, సావిత్రి, దొడ్డిపాటి సారయ్య, బొల్లారపు సంపత్, రాజేష్, యాకయ్య, కె రవీందర్, ఓరుగంటి సాంబయ్య పాల్గొన్నారు.

## బయ్యారంలో ప్రజా ప్రెస్ క్లబ్ ఏర్పాటు



**వరంగల్ వాయిస్, బయ్యారం :** కోదండ రామస్వామి ఫంక్షన్ హాల్‌లో నూతనంగా ప్రజా ప్రెస్ క్లబ్‌ను కొంపెల్లి అమరనాథ్ అధ్యక్షతన ఏర్పాటు చేయటం జరిగింది. ఈ సందర్భంగా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చాపల కృష్ణారెడ్డి, పుల్లూరి ఉపేందర్, మాలోత్ సురేష్ (సలహా దారులు)లను ఎన్నుకోటం జరిగింది. అధ్యక్షుడిగా తుడుం రాజేష్ ను, కార్యదర్శిగా చిలకమర్రి గురుప్రసాద్ ను, సహాయ కార్యదర్శిగా మాట్ల కిషోర్ ను, ఉపాధ్యక్షులుగా పగడాల రామారావు, సుధాకర్, అంగోత్ శ్రీనును, కోశాధికారిగా కోటా సుదాకాంత్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన రాజేష్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో ఉంచిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహించి అందరికీ న్యాయం చేస్తానన్నారు.

## ఆర్టీఏ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆర్టీఏ కార్యాలయం వరంగల్ లో హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్టీఏ రంగారావు నేతృత్వంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్న రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ పాలకవర్గం మాట్లాడుతూ తలసేమియా పేషెంట్లకు అనునిత్యం చాలా రక్తం అవసరమని, వారికోసం రక్తదాతలు రక్తదాన చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం కర్తవ్యంగా భావించాలని అన్నారు. ఈ సందర్భంగా రక్తదానం శిబిరంలో పాల్గొన్న రక్తదాతలను అభినందించి రెడ్ క్రాస్ సొసైటీ పక్షాన వారికి సర్టిఫికేట్లను అందచేసి ఆర్టీఏ కార్యాలయం వారికి పాలకవర్గం తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ రక్తదాన శిబిరంలో ఆర్టీఏ రంగారావును రెడ్ క్రాస్ పాలకవర్గం శాలువాతో సత్కరించారు. ఈ రక్తదాన శిబిరంలో హనుమకొండ రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణు గోపాల్, పోట్లపల్లి శ్రీనివాసరావు, ఏఎంవీఐ కోలా రవీందర్, ఆర్టీఏ సిబ్బంది, రెడ్ క్రాస్ సిబ్బంది రక్తదాతలు పాల్గొన్నారు.

## మురుగు కాలువలను శుభ్రపరచాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 40వ డివిజన్ కరీమాబాద్ చౌరస్తాలో శ్రీ భూలక్ష్మి , శ్రీలక్ష్మి బొడ్రాయి పునర్ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొనే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో బొడ్రాయి పరిసర ప్రాంతాలలో మురుగు కాలువలను, రహదారులను శుభ్రపరచేందుకు తగు చొరవ చూపాలని కార్పొరేటర్ మరుపల్ల రవి సానిటరీ సూపర్ వైజర్ మాదాసు సాంబయ్య, సానిటరీ ఇన్ స్పెక్టర్ వెంకన్నకు సూచించారు. 12, 13, 14న బొడ్రాయి వద్ద పూజా కార్యక్రమంతో పాటు 5సెంటర్ల వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టినందున ఆ ప్రాంతా లన్ని శుభ్రపరిచి మహానగరక పాలక సంస్థ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని అందిస్తామని కార్పొరేటర్ రవి తెలిపారు. మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో పలు గ్రౌండ్లలో పిచ్చి మొక్కలను తొలగించడానికి ఎగుడుదిగుడుగా ఉన్న ప్రదేశాలను సమాంతరం చేయడానికి డోజర్ ద్వారా చేస్తున్న పనులను కార్పొరేటర్ మరుపల్ల రవి పరిశీలించారు. ఈ పరిశీలనలో సానిటరీ సూపర్ వైజర్ మాదాసు సాంబయ్య, సానిటరీ ఇన్ స్పెక్టర్ వెంకన్న, జవాన్ ప్రశాంత్, బొడ్రాయి కమిటీ ప్రతినిధులు కొమ్మిని రాజేందర్, వగిలిశెట్టి అనిల్ కుమార్, బత్తిని రంజిత్, షేర్ల శ్రీధర్, అప్పాల వేణు, వంగరి సురేష్, వగిలిశెట్టి రాఘవ, వగిల్ శెట్టి సంజీవరావు, గుడిమల్ల నరేష్ ఉన్నారు.

## సీఐ వేణుకు వీడ్కోలు సత్కారం



**వరంగల్ వాయిస్, మడికొండ :** బదిలీపై టాస్క్ ఫోర్స్ వరంగల్ కు బదిలీపై వెళ్తున్న మడికొండ సీఐ జి.వేణుని మడికొండ పోలీస్ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మడికొండ సబ్ ఇన్ స్పెక్టర్ రాజబాబు, దివ్య, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్ జయరాజు, కానిస్టేబుల్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బిజేపీ జిల్లా నాయకుడు గడ్డం మహేందర్ ఆధ్వర్యంలో మడికొండ సీఐ వేణు బదిలీపై వరంగల్ టాస్క్ ఫోర్స్ వెళ్తున్న సందర్భంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు దార ధనుంజయ్, బండ రాజు, పోలిశెట్టి అన్వేష్, పండుగ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మెట్టుగుట్టపై మాస శివరాత్రి ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, మడికొండ :** ఓరుగల్లు మహా నగరంలో అతి ప్రాచీనమై, దక్షిణ కాశీగా పిలవబడుతున్న శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి, శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి దేవస్థానం ఎంతో విరాజితమైనటువంటి మెట్టుగుట్ట క్షేత్రంలో గురువారం మాస శివరాత్రి సందర్భంగా అర్చకులు శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి వారికి మహన్యాసపూర్వకంగా రుద్రాభిషేకం నిర్వహించి భక్తులచే అభిషేకం చేయించారు. తదుపరి యాగశాలలో రుద్ర హోమం నిర్వహించి, రామాలయంలో శ్రీ సీతా రామచంద్ర స్వామి వారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కే.శేషు భారతి, అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎన్ హెచ్ఎం ఆల్ క్యాడర్స్ ఉద్యోగుల సంఘం నాయకుడు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ రామ రాజేష్ ఖన్నా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 16న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వలుపదాసు చంద్రశేఖర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఈ నెల 16న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారని, ఒక్క రోజు సమ్మె చేస్తున్నట్టుగా వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వలుపదాసు చంద్రశేఖర్ తెలియజేయడం జరిగింది. ఎన్ హెచ్ఎం కాంటాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్ హెచ్ఎం స్కీమ్ ఉద్యోగులను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని, ఎన్ హెచ్ఎం ఉద్యోగులకు రెండు నెలల వేతనాలు అనగా డిసెంబర్, జనవరి వేతనాలు వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ఎం ఉద్యోగులు శ్యాం కుమార్, మురళి, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగులు నుంచి జాగ్రత్తలు తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, మరిపెడ :** కడుపులో నులిపురుగులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తొర్రూరు ఆర్డీవో నర్సింగరావు అన్నారు. మరిపెడ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల దినోత్సవంలో భాగంగా నులిపురుగుల నిర్మూలన పై డాక్టర్ మానస, ఏఎన్ఎం, ఆశ, అంగన్వాడీ టీచర్లకు ఈ నెల 12న జరిగే కార్యక్రమంపై గురువారం అవగాహన కార్యక్రమం మరిపెడ మున్సిపాలిటీలో ఏర్పాటు చేశారు. తొర్రూరు ఆర్డీఓ మాట్లాడుతూ మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో 1-19 సంవత్సరాలు ఉన్న పిల్లలకు ఆల్బండాజోలు టాబ్లెట్ అందించనున్నట్లు తెలిపారు. నులి పురుగులు ఉన్న పిల్లలకు తరుచుగా కడుపు నొప్పి రావడం, ఆకలి మందగించడం, చదువుపై శ్రద్ధ తగ్గడం, రక్త హీనత, బరువు తగ్గడం, ఎదుగుదల లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయ న్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, మున్సిపాలిటీ కమిషనర్ ఏ.రాజు, హెల్త్ సూపర్ వైజర్ కృష్ణ, సుదర్శన్, మున్సిపల్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

## కోతులు, కుక్కలు, దోమలు స్వైర విహారం

### కాజీపేట మున్సిపాలిటీ ఎదుట ధర్నా



**వరంగల్ వాయిస్, కాజీపేట :** హనుమకొండ, కాజీపేట పరిధిలో కోతులు, కుక్కలు, దోమలు సైర విహారం చేస్తున్నాయని మున్సిపల్ అధికారులు, నాయకులు పట్టించుకోవట్లేదని బీజేపీ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం మినీ మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సమస్యను పట్టించుకునే నాథుడే లేడని, ప్రజలు, చిన్న పిల్లలు, పెద్దవాళ్లు కుక్కల కాటుకు గురయ్యారన్నారు. ఈ కుక్కల భయానికి బయట తిరగాలన్నా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీలు సరిగ్గా శుభ్రం చేయక దోమల వల్ల మలేరియా, డెంగీ జ్వరాలతో బాధపడుతున్నారనీ, కోతులతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని లేకుంటే తమ వల్ల కాదని రాజీనామా చేసి పక్కకు తప్పుకోండని కమిషనర్ ను సూచించారు. ఇది ఇలాగే కొనసాగితే కమిషనర్ ఇల్లుని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాంబయ్య, హలీం, మణికుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** మండలంలోని మరియాపురం గ్రామానికి చెందిన కౌడగాని శ్రీనాథ్ ఇటీవల గీసుకొండ క్రాస్ వద్ద మోటార్ సైకిల్ యాక్సిడెంట్ జరిగి కాలు విరిగినందున పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశం మేరకు కాంగ్రెస్ జిల్లా నాయకుడు, సామాజికవేత్త అల్లం బాలకిషోర్ రెడ్డి సహకారంతో అతడికి రూ. 3000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అల్లం మర్రెడ్డి మండల అధ్యక్షుడు తుమ్మలపల్లి శ్రీనివాస్, జిల్లా నాయకుడు సాయిలి ప్రభాకర్, మండల ప్రధాన కార్యదర్శి కుసం రమేష్, మండల నాయకులు కొమ్ము శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రుద్ర ప్రసాద్, మాదాసి రాంబాబు, మర్రి క్రాంతి, మరియాపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు బిట్ల శివ మోహన్, దిలీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## బాధ్యతలు చేపట్టిన సీఐ బాబులాల్



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** గీసుగొండ సీఐగా జి.బాబూలాల్ గురువారం మధ్యాహ్నం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ రామకృష్ణను ఐజీకి అటాచ్ చేయడంతో ఆ స్థానంలో జి.బాబులాల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గీసుగొండ సర్కిల్ కార్యాలయానికి చేరుకున్న ఆయన బాధ్యతలు పట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పని చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. మట్కా, గుట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదన్నారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకు ఎస్ఐలు వెంకన్న, శ్వేతా, సిబ్బంది అభినందనలు తెలిపారు. గతంలో వరంగల్ జిల్లాలో టాస్క్ ఫోర్స్, వరంగల్ ట్రాఫిక్ సీఐగా జి. బాబులాల్ పని చేశారు.

## ప్రభుత్వ స్థలాలను విక్రయించిన వారిపై కఠిన చర్యలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రభుత్వం వివిధ అభివృద్ధి పథకాల క్రింద అర్హులైన వారిని గుర్తించి అందజేసిన ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినా, విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తెలిపారు. గురువారం సమీకృత జిల్లా అధికారుల భవన సముదాయం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రతీక్ జైన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గార్ల, బయ్యారం మండలాలలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత అధికారులు తక్షణం స్పందిస్తూ పరిష్కరించాలన్నారు. వివిధ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన భూమిని విక్రయించినా, ఆక్రమించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా కోర్టు ద్వారా పరిష్కారం అయిన గిరిజన రైతుల భూముల వివరాలను రెవెన్యూ రికార్డులో నమోదు చేయాలన్నారు. తద్వారా రైతు బంధు, రైతు బీమా పథకాలు పొందేందుకు అర్హత ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ట్రైబల్ వెల్ఫేర్ ఉపసంచాలకులు ఎర్రయ్య, మహబూబాబాద్ ఆర్డీఓ అలివేలు, గార్ల, బయ్యారం తాసిల్దార్లు స్వాతి బిందు, ఇమ్మానియేల్, ఎంపీడీవోలు రవీందర్, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 28న యువజన రాష్ట్ర సమ్మేళనం

### ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలీ ఉల్లా ఖాద్రీ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశ పాలకుల విధానాలు నేటి యువత కర్తవ్యం అనే అంశంపై ఈ నెల 28న రాష్ట్ర యువజన సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వలీ ఉల్లా ఖాద్రీ తెలిపారు. గురువారం శివనగర్ సీపీఐ కార్యాలయంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సదస్సుకు రాష్ట్రంలో ఉన్న అన్ని యువజన, విద్యార్థి, మేధావి వర్గ బాధ్యులను ఆహ్వానించనున్నట్లు, అదేవిధంగా జాతీయ నేతలు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వలీ ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ భారతదేశంలోనే యువత ఎక్కువ ఉందని చెప్పారు. ప్రపంచంలో 186కోట్ల మంది యువజనులు ఉంటే అందులో 28శాతం భారతీయులేనన్నారు. నవ యువకులతో నవనవలాడుతున్న యువజన దేశం భారత్ అన్నారు. ఏ దేశానికి లేనంత యువ సంపద మనకున్నప్పటికీ ఉత్తేజం, ఉత్సాహం కరువయ్యాయన్నారు. పాలకుల వినాశకర విద్యా విధానాల కారణంగా దేశంలోని 30శాతం మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అకాశాలు లేవన్నారు. రాష్ట్రానికి విభజన హామీలకు దిక్కులేదని, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే లేదన్నారు. ఖాజీపేట్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, సైనిక్ స్కూల్స్ వంటి హామీలను నెరవేర్చలేదన్నారు. కనీసం వీటినైనా నిర్మించి ఉంటే వేలాది మందికి ఉపాధి లభించి ఉండేదన్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న వినాశకర ఆర్థిక విధానాల ఫలితంగా చదువుకు తగ్గ ఉద్యోగాలు రావడం లేదని విమర్శించారు. డిగ్రీలు, పీజీలు, పీహెచ్ఎలు, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, లా కోర్సులు చదివినవారు కూడా చివరకు రైల్వే గ్యాంగ్ మెన్ ఉద్యోగాలకు, పోలీస్ కానిస్టేబుల్, హెూంగార్డు ఉద్యోగాలకు అవకాశాలు లేక వలస పోయే వారు కొందరైతే, మరి కొంతమంది నిరాశ, నిస్పృహలతో కొకొయిన్, హెరాయిన్ వంటి మత్తుమందులకు బానిసలవుతున్నారన్నారు. అవినీతి, దోపిడీలకు ఆస్కారం లేని సమాజం యువత ఆకాంక్ష అని చెప్పారు. ఇది యువతతోనే సాధ్యమని, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో యువత పాల్గొనాలని పిలుపునిచ్చారు. యువజన సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వారు యువతకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్క సుధీర్, భాస్కర్, ఫయాజ్, జగదీష్, సుమన్, రామన్, అనిల్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# 16న భారత్ బంద్‌లో అంగన్వాడీలు

### జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ



**వరంగల్ వాయిస్, మరిపెడ :** ఈనెల 16న జరిగే సార్వత్రిక సమ్మె సందర్భంగా గ్రామీణ భారత్ బంద్ పాటించాలని తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ పిలుపునిచ్చారు. గురువారం మరిపెడ పట్టణ కేంద్రంలోని సీడీపీఓ శిరీషకు 16న జరిగే సార్వత్రిక సమ్మె భారత్ బంద్ లో అంగన్వాడి టీచర్లు అండ్ హెల్పర్లు పాల్గొంటారని తెలియజేస్తూ ఆమెకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా బెస్త సంపూర్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, కార్మిక ఉద్యోగులు , అసంఘటిత కార్మికుల పట్ల అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా అఖిల భారత స్థాయిలో ఈ నెల 16న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంధు పాటించాలని జాతీయ సంఘాలు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమ్మెకు జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ సీఐటీయూ, ఐఎన్ టీయూసీ, ఏఐటీయూసీ, టీఎన్ టీయూసీ, హెచ్ఎంఎస్, ఐఎఫ్ టీయూ, బీఆర్ టీయూ సమ్మెతో పాటు బంద్ పాటించాలని ఈ సంఘాలు నిర్ణయించినట్లు ఆమె పేర్కొన్నారు. అఖిల భారత పిలుపు మేరకు దేశవ్తంగా ఉన్న అంగన్వాడి ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటారని ముందస్తుగానే అధికారులకు సమాచారాన్ని అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సమ్మెలో ప్రధానంగా ఐసిడిఎస్ బడ్జెట్ పెంచాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ప్రతి అంగన్వాడి ఉద్యోగిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు కుమ్మరి కుంట్ల జ్యోతి, ప్రచార కార్యదర్శి మంగమ్మ, మండల కోశాధికారిలీలా బాయ్, గుమ్మడి కళమ్మ, సెక్టార్ నాయకురాలు ఉమారాణి, స్వర్ణ, రాములమ్మ, కవిత, లక్ష్మీ తదితరులు ఉన్నారు.

## మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, మరిపెడ :** ఆధార్ కార్డు లింకు చేయిస్తానని దివ్యాంగుడినైనా తన వద్ద ఓ వ్యక్తి రూ .15 వేలు తీసుకొని మోసం చేశాడని, మరిపెడ మండలంలోని స్టేజి తండా జీపీ పరిధిలోని కుడియాతండాకు చెందిన దివ్యాంగుడు జాటోత్ బిచ్య ఆరోపించాడు. ఈ సందర్భంగా గురువారం బాధితుడు బిచ్య మాట్లాడుతూ తనకు నెల నెల వచ్చే పింఛన్ డబ్బులకు మా నాన్న లచ్చు ఆధార్ కార్డ్ లింక్ అయి ఉంది. దీంతో మా నాన్న వేలిముద్రలతోనే నాకు పింఛన్ డబ్బులు వస్తున్నాయి. దీనిని నా ఆధార్ కార్డు లింక్ చేసి నా వేలు ముద్రతో డబ్బులు వచ్చే విధంగా చేస్తానని ఇటీవల మరో వ్యక్తి ద్వారా పరిచయం అయిన మహబూబాబాద్ జిల్లా పెద్ద గూడూరు మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన దారావత్ స్వామి నాకు చెప్పాడు. అందుకు రూ.15వేలు ఖర్చు అవుతుందని చెప్పి తన వద్ద నుంచి రెండు దఫాలుగా మొత్తం డబ్బులు తీసుకున్నాడు. రెండు నెలలైనా ఆధార్ కార్డు లింక్ చేయించకపోగా ముఖం చాటేస్తున్నాడు. కనీసం తన ఫోన్ కూడా లిఫ్ట్ చేయడం లేదని బాధితుడు వాపోయాడు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా అవతలి వ్యక్తి నుంచి కనీసం స్పందించడం లేదు. దివ్యాంగుడినైనా తనను మాయ మాటలతో మోసం చేసిన దారావత్ స్వామిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

## వరంగల్ జిల్లాను మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దుదాం

### కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబరీష్ కిశోర్ ఝా




**వరంగల్ వాయిస్, వరంగల్ :** మద్యం, మాదక ద్రవ్యాల బాధితుల చికిత్స కేంద్రాన్నీ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య పేర్కొన్నారు. గురువారం దేశవ్యాప్తంగా 41 మద్యం, మాదక ద్రవ్యాల బాధితుల చికిత్స కేంద్రాలను కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మంత్రి డా.వీరేంద్రకుమార్ వర్చువల్ గా ప్రారంభించగా, ఎంజీఎంలోని కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, పోలీస్ కమిషనర్ అంబరీష్ కిశోర్ ఝా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా మంత్రి , రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పంపిన సందేశాన్ని ఆసుపత్రి పర్యవేక్షకులు చంద్రశేఖర్ చదివి వినిపించారు. అనంతరం గంజాయి రహిత జిల్లాగా చేయుటకు తమవంతు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం సూపరిండెంట్ చంద్రశేఖర్, జిల్లా సంక్షేమ అధికారి శారద, మానసిక వైద్య నిపుణులు శ్రీనివాస్, కేఎంసీ ప్రిన్సిపల్ మోహన్ దాస్, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురువారం 08, ఫిబ్రవరి 2024
www.warangalvoice.net

# టీఎన్జీవోస్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా టీఎన్జీఎస్ భవన్ లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో టీఎన్జీవోస్ కేంద్ర సంఘ కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు ఎన్నికల అధికారిగా నిర్వహించిన సమావేశంలో గురువారం వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ సంఘానికి వరుసగా మూడవసారి జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన గజ్జెల రామ్ కిషన్ మాట్లాడుతూ 70సంవత్సరాల చరిత్ర గల టీఎన్జీవోస్ సంఘానికి నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ఉద్యోగులకు, టీఎన్జీవోస్ కేంద్ర సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, అదేవిధంగా టిఎన్జీవోస్ సంఘం ఎల్లప్పుడూ ఉద్యోగుల హక్కుల పరిరక్షణలో అండగా ఉంటుందని తెలిపారు. ఉద్యోగులు ప్రభుత్వానికి అండగా ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ముందుండాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకున్న కార్యవర్గంలో జిల్లా అధ్యక్షుడిగా గజ్జెల రామ్ కిషన్, కార్యదర్శులు గాజె వేణుగోపాల్, అసోసియేట్ అధ్యక్షులుగా హేమా నాయక్, కోశాధికారిగా పాలకుర్తి సదానందం, ఉపాధ్యక్షులుగా ప్రమీలావతి, వంశీధర్ బాబు, జగదీశ్వర్, మురళీధర్ రెడ్డి, గద్దల రాజు, ఇంద్రసేనారెడ్డి, దుర్గారావు, యకమ్మ, సంయుక్త కార్యదర్శులుగా చందర్ రావు, మధు, రమాదేవి, త్రివేణి, శ్రీ జ్యోతి, తిరుమల దేవి, శరత్ కుమార్, నూతన్ ప్రసాద్, కార్యనిర్వాహణ కార్యదర్శిగా రవీందర్, వంశీ, రామకృష్ణ, రజిత, ప్రచార కార్యదర్శిగా శెంకేసి రాజేష్, గంగాధర్, సత్యనారయణ, ప్రియాంక, స్పోర్ట్స్ సెక్రటరీగా గణేష్, కల్చరల్ సెక్రటరీగా సుశీల, ఆఫీస్ సెక్రటరీగా యూసుఫ్, కార్యవర్గ సభ్యులుగా సందీప్, సునీత నాయర్, రజనీకాంత్, అజర్, సత్యనారాయణ రావు, శివకుమార్, నాగరాజు, మానస, చిరంజీవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బూరుగు రవి, కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు హరికృష్ణ, తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాస్య నాయక్, సిటీ యూనిట్ అధ్యక్షుడు వెలిశాల రాజు, ఎంజీఎం యూనిట్ అధ్యక్షుడు రవికుమార్, మెడికల్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, రజినీకాంత్, సంగెం, నర్సంపేట, నెక్కొండ, వర్ధన్నపేట పేట యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్, సురేష్ రెడ్డి, శ్యామ్, దేవేందర్, హర్షవర్ధన్ రెడ్డి, కృష్ణ, సతీష్ , తదితర ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ యాదవ్



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** జనగామ రూరల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ గా ఉన్న ఎల్లబోయిన శ్రీనివాస్ యాదవ్ గురువారం రఘునాథ పల్లి సీఐగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్ రెడ్డి వరంగల్ ఐటీకి బదిలీ అయిన విషయం తెలిసిందే. జనగామలో పనిచేసిన శ్రీనివాస్ యాదవ్ కు రఘునాథ పల్లికి పోస్టింగ్ ఇవ్వడంతో పదవీ బాధ్యతలు చేపట్టారు. సీఐ మాట్లాడుతూ శాంతి భద్రత పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిత్యం అందుబాటులో ఉంటానని, ప్రతి ఒక్కరు నేరుగా పోలీస్ స్టేషన్ కు రావచ్చని ఆయన తెలిపారు.

## లబ్ధిదారుల వివరాల సేకరణ



**వరంగల్ వాయిస్, బయ్యారం :** మండలంలోని వెంకట్రాంపురం గ్రామపంచాయతీ పరిధిలో కార్యదర్శి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి లబ్ధిదారుల వివరాలు, గ్యాస్ కనెక్షన్ నెంబర్, కంపెనీ పేరు, యాప్ లో అప్ లోడ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొనడం జరిగింది.

## ప్రజా పాలన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి



**వరంగల్ వాయిస్, రేగొండ :** ప్రజల సంక్షేమం, అభివృద్ధి దృష్ట్యా ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో ఆరు గ్యారంటీల పథకాల కోసం ప్రజలు అందించిన దరఖాస్తుల వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఆన్ లైన్ లో నమోదు చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భావేష్ మిశ్రా అన్నారు. గురువారం రేగొండ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియతో పాటు ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేసిన తీరును అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆన్ లైన్ లో నమోదు చేసిన వాటిలో కులం, పుట్టిన తేదీ ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, మొబైల్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా ఇతర వివరాలతో కూడిన ఆన్ లైన్ ఫారంను ఎలాంటి తప్పులు లేకుండా దరఖాస్తు ఫారంలో ఉన్న ప్రకారంగానే ఒకటికి రెండుసార్లు క్షుణ్ణంగా పరిశీలించి, నమోదు చేయాలన్నారు. అభయహస్తం గ్యారంటీ పథకాలు, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, రైతుభరోసా పథకాల సంబంధిత వివరాలు దరఖాస్తు ఫారంలో నమోదు చేసిన విధంగానే ఆన్ లైన్ లో ఎంట్రీ చేయాలని సూచించారు. దరఖాస్తు ఫారములను, జతపరిచిన ప్రతులను పరీక్షించాలని, దరఖాస్తులో పొందుపరిచిన ప్రతి సమాచారాన్ని ఆన్ లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్యామెల్, ఎమ్మార్వో సత్యనారాయణ స్వామి, ఆర్ ఐ నరేష్ కుమార్, ఎంపీడీవో సురేందర్ గౌడ్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చెన్నమల్ల నరసయ్య ఆశయాలు సాధిద్దాం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీపీఐఎంఎల్ ప్రజాపంథా మాజీ నాయకుడు, నారక్క పేట మాజీ సర్పంచ్ చెన్నమల్ల నర్సయ్య ఆశయాలు సాధిద్దామని సీపీఐఎంఎల్ ప్రజా పంథా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చిన్న చంద్రన్న అన్నారు. నేడు మండలంలోని నారక్క పేట గ్రామంలో చెన్నమల్ల నర్సయ్య పదవరోజు సందర్భంగా సంతాప సభ సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రన్న మాట్లాడుతూ 1981 నుంచి తను ఇటీవల అనారోగ్యంతో మరణించే నాటి వరకు పీడిత ప్రజల పక్షాన నిలబడి కొట్లాడిన వ్యక్తి నర్సయ్య అని అన్నారు. పార్టీ నాయకుడిగా ఉన్న, ప్రజా ప్రతినిధిగా ఎన్నికైన, నిజాయితీగా పేదలకు సేవలు చేశాడని అన్నారు. ఇలాంటి తరుణంలో నిస్వార్ధంగా పేద ప్రజల పక్షాన నిలబడ్డ చెన్నమల్ల నర్సయ్య అకాల మరణం విప్లవోద్యమానికె కాదు సమాజానికి కూడా తీరని లోటు అని అయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్ నాయకులు పూనెం ప్రభాకర్, ఐఎఫ్ టీయూ రాష్ట్ర నాయకులు కొత్తపల్లి రవి, రైతు కూలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల పైడి, న్యూ డెమొక్రసీ జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావుతో పాటు ప్రజాపంథా నాయకులు సారంగం, రాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు నరేష్‌తో పాటు గ్రామ ఎంపీటీసీ, మాజీ ఎంపీటీసీ, ఉప సర్పంచ్, మాజీ ఎంపీపీ, సింగల్ విండో డైరెక్టర్, కాంగ్రెస్, బీఆర్ఎస్ తదితర పార్టీల పెద్దలు, స్నేహితులు ప్రముఖ రచయిత యోచన, ఈరెల్లి మల్లేష్, కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొని విప్లవ గేయాలను ఆలపించి జోహార్లు తెలిపారు.

## మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడుదాం

### టీఎస్‌జీకేఎస్ గౌరవాధ్యక్షుడు గడ్డం సదానందం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఈనెల 16న తలపెట్టిన దేశవ్యాపిత సమ్మెను విజయవంతం చేసి ప్రధాని నరేంద్ర మోడి కార్మిక వ్యతిరేక, ప్రజాకంఠక విధానాలను తిప్పి కొడుదామని, ప్రధాని నరేంద్ర మోడీ మెడలు వంచదామని తెలంగాణ సింగరేణి గని కార్మిక సంఘం (టీఎస్ జీకేఎస్) గౌరవాధ్యక్షుడు కామ్రేడ్ గడ్డం సదానందం పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్ లోని సీపీఐ ఎంఎల్ ఆర్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో సదానందం మాట్లాడుతూ నేడు కేంద్రంలోని బీజేపీ/ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం కార్పొరేట్ల,కు బడా పెట్టుబడిదారులు తమ సంపదను మరింతగా పోగుచేసుకునేందుకు కార్మిక వర్గం హక్కులను కాలరాస్తూ పేద, బడుగు బలహీన వర్గాల నడ్డి విరుస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన సింగరేణి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి

### శాయంపేట ఎస్సై దేవేందర్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** విద్యార్థులు అన్ని రంగాలలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని శాయంపేట ఎస్సై దేవేందర్ అన్నారు. శాయంపేట మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బా పూలే గురుకుల పాఠశాల విద్యార్థుల క్రీడా మైదానంలో విద్యార్థులకు లాంగ్ జంప్, హైజంప్ ప్రాక్టీస్ కోసం ఎస్సై తన సొంత ఖర్చుతో ఇసుక ఏర్పాటు చేయించి, దగ్గరుండి విద్యార్థులతో ప్రాక్టీస్ చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ దేవేందర్ మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం గ్రామపంచాయతీ అధికారులతో మాట్లాడి మైదానంలో లైట్స్ ఏర్పాటు చేయిస్తానని ఆన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కష్టపడి ఉన్నత స్థాయిలో స్థిరపడి కన్న తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలు సమయం సమీపిస్తున్నందున ఒత్తిడికి లోను కాకుండా స్వేచ్ఛగా, భయం లేకుండా చదివాలని, పరీక్షలకు మానసికంగా సంసిద్ధం కావాలని సూచించారు. క్రీడల ప్రాక్టీస్‌కు తన పూర్తి సహకారం అందిస్తానని స్పష్టంచేశారు. ప్రిన్సిపల్ మోతే రాజ్ కుమార్, పీఈటి సతీష్, విద్యార్థులు పాల్గన్నారు.

# పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలి

### టీపీసీసీ సోషల్ మీడియా స్టేట్ కోఆర్డినేటర్ నవీన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాబోయే పార్లమెంట్ కు ఎన్నికలకు సిద్ధం కావాలని టీపీసీసీ సోషల్ మీడియా స్టేట్ కోఆర్డి నేటర్ పట్టెం నవీన్ తెలిపారు. వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ సోషల్ మీడియా కార్యదర్శి మొహమ్మద్ ముస్తాక్ నేహాల్, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి, హన్మకొండ జిల్లా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ కేతిడి దీపక్ రెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ పార్లమెంట్ ఎన్నికలపై సోషల్ మీడియా వరంగల్ పార్లమెంట్ సెగ్మెంట్ జిల్లా కోఆర్డి నేటర్స్, అసెంబ్లీ కోఆర్డినేటర్స్, మండల కోఆర్డినేటర్స్, డివిజన్ కోఆర్డినేటర్స్ తో ముఖ్య సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా టీపీసీసీ సోషల్ మీడియా స్టేట్ కోఆర్డినేటర్ పట్టెం నవీన్ మాట్లాడుతూ 2023లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో ఎలాగైతే మనం ఎమ్మెల్యేలను గెలిపించుకున్నామో, అలాగే రాబోయే ఎంపీ ఎన్నికల్లో కూడా సోషల్ మీడియా టీం కష్టపడి ఎంపీలను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో సోషల్ మీడియా పాత్ర ఎంతో ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారని తెలిపారు. డివిజన్ లో సోషల్ మీడియా డివిజన్ కమిటీలు, బూత్ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలను చైతన్యవంతులు చేయాలంటే సోషల్ మీడియా ప్లాట్ ఫాం చాలా కీలకమైందని తెలిపారు. అందుకే మనం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అధికారంలోకి వచ్చాక ఏం చేసారు ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు.




# అడ్వెంచర్ మూవీ ఊరు పేరు భైరవకోన

యంగ్ ట్యాలెంటెడ్ సందీప్ కిషన్ మ్యాజికల్ ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'ఊరు పేరు భైరవకోనస విఐ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. కావ్య థాపర్ , వర్ష బొల్లమ్మ కథానాయికలుగా నటించారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా లావిష్ స్కేల్ లో నిర్మించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై అనిల్ సుంకర సగర్వంగా సమర్పిస్తున్నారు. బాలాజీ గుత్తా ఈ చిత్రానికి సహ నిర్మాత. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకులలో హ్యూజ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ఈ చిత్రం ఫిబ్రవరి16న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ వర్ష బొల్లమ్మ'ఊరు పేరు భైరవకోన' విశేషాలని విలేకరుల సమావేశంలో పంచుకున్నారు. చిత్రకత చాలా కొత్తగా, అద్భుతంగా అనిపించింది. అసలు ఇలాంటి కథ ఎలా అలోచించగలిగారో అనిపించింది. ఇలాంటి పాత్ర గతంలో ఎప్పుడూ చేయలేదు. చేయగలనా? లేదా? అని ఆలోచించుకోవడానికి కొంత సమయం అడిగాను. తర్వాత ఆనంద్ కంప్లీట్ నేరేషన్ ఇచ్చారు. అది విగానే చాలా ఆనందంగా అనిపించింది. చేయగలననే నమ్మకం కుదిరింది. ఇందులో భూమి అనే పాత్రలో కనిపిస్తాను. భూమి ట్రైబల్ గర్ల్. తన ఊర్లో తనొక్కరే చదువుకున్న అమ్మాయి. చూడటానికి అందంగా అమాయకంగా కనిపిస్తుంది. తప్పుని నిలదీసే ధైర్యం వున్న అమ్మాయి. నేను హిల్ స్టేషన్(కూర్గ్) నుంచి వచ్చాను. పక్రుతి జీవితంలో ఒక భాగం. నిజ జీవితంలో కూడా మేము చెట్లు, నదులు, కొండలు, జంతువులని ఆరాధిస్తాం. ఆ రకంగా భూమి పాత్ర నేను రిలేట్ చేసుకునే విధంగా వుందని వివరించారు.




# అనసూయ సినిమా 'అరి'కి డిమాండ్



సినిమాలో కంటెంట్ ఉంటే చాలు.. అది తక్కువ బడ్జెట్ చిత్రమైనా కూడా దానిని రీమేక్ చేయడానికి ఇతర భాషల స్టార్లు ముందుకు వస్తారు. ప్రస్తుతం అనసూయ లీడ్ రోల్‌లో నటిస్తున్న మూవీకి కూడా అదే పరిస్థితి ఏర్పడింది. యాంకర్ నుండి యాక్టర్‌గా మారిన అనసూయ చేతిలో పలు సినిమాలు ఉండగా.. అందులో 'అరి' కూడా ఒకటి. ఈ సినిమా ఇంకా ప్రేక్షకుల ముందుకు రాకముందే కోలీవుడ్, బాలీవుడ్ నుండి దీని రీమేక్ కోసం పోటీ మొదలయ్యిందని వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే దీని రీమేక్ రైట్స్ కోసం ఒక బాలీవుడ్ స్టార్ లైన్‌లో ఉండగా.. తాజాగా ఒక కోలీవుడ్ హీరో కూడా ఇందులో యాడ్ అయ్యాడని సమాచారం. ఈ సినిమాలో వినోద్ వర్మ లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. మనుషుల్లో ఉండే లోతైన కోరికలను తీర్చే పాత్రలో వినోద్ వర్మ కనిపించనున్నాడు. ఇక కోరికలు తీరాలి అనుకునేవారు ఒక్కొక్కరుగా వచ్చి తనకు చెప్పుకుంటారు. అదే సమయంలో వారందరి చేత నేరాలకు పాల్పడేలా చేస్తాడు వినోద్ వర్మ. ఆ తర్వాత వారి జీవితాల్లో ఎలాంటి మార్పులు వస్తాయి, ఎలా మలుపులు తిరుగుతాయి అనేది మిగిలిన కథ. అలా కోరిక తీరడం కోసం తన వద్దకు వచ్చే ఒక పాత్రలో అనసూయ భరద్వాజ్ కనిపించనుంది. ఇప్పటికే ఈ సినిమా ట్రైలర్ విడుదల అవ్వగా.. మూవీ రిలీజ్‌కు మాత్రం సమయం పడుతుంది. ఇంతలోనే 'అరి' రీమేక్ గురించి టాలీవుడ్‌లో చర్చలు మొదలయ్యాయి.






# అఖండ-2 నిర్మాతగా అల్లు ?

'అఖండ' విజయం తర్వాత ఈ సినిమాకు బోయపాటి సీక్వెల్ ప్లాన్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే 'అఖండ 2' సినిమాకు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఇంతకీ ఆ వార్త ఏంటి అంటే.. బోయపాటి త్వరలోనే బాలకృష్ణతో 'అఖండ 2' ప్లాన్‌జి చేస్తున్నట్లు ఈ సినిమాకు అల్లు అరవింద్ నిర్మాతగా వ్యవహరించనున్నట్లు తెలుస్తుంది. ఈ ఏడాది చివర్లో జరగనున్న ఏపీ అసెంబ్లీ ఎన్నికల రాజకీయ ప్రచారానికి విరామం తీసుకోనున్నారు బాలకృష్ణ. ఇక ఎన్నికల అనంతరం బాలయ్య 'అఖండ 2' షూటింగ్‌ను ప్రారంభించనున్నట్లు సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.టాలీవుడ్ మాస్ కమర్షియల్ మాస్ బ్లాక్‌బస్టర్స్ దర్శకుడు బోయపాటి శ్రీను, అగ్ర నిర్మాత ఏస్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్‌లు త్వరలో ఓ సినిమాకు చేతులు కలపనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబినేషన్‌లో ఇంతకుముందు సరైనోడు సినిమా రాగా ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ అందుకోవడమే కాకుంగా అల్లు అర్జున్‌కు మాస్ ఇమేజ్ తెచ్చిపెట్టింది. ఇక 2016 తర్వాత అల్లు అరవింద్, బోయపాటి చేతులు కలుపుతుండడంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి మొదట అల్లు అర్జున్‌తో ఈ సినిమా ఉండబోతుందని అందరూ అందరూ అనుకున్నారు. కానీ అనుహ్యంగా ఈ ప్రాజెక్ట్‌లోకి బాలకృష్ణ వచ్చి చేరాడు.

గురువారం 08, ఫిబ్రవరి 2024
www.warangalvoice.net

# అంచెలంచలుగా ఎదిగిన శోభక్క

## యాది సభలో అరుణోదయ విమలక్క



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ కందాల శోభారాణి సమాజ పరివర్తనలో అంచెలంచెలుగా ఎదిగారని అరుణోదయ విమలక్క అన్నారు. గురువారం హనుమకొండ పట్టణంలోని కేయూ రెండో గేటు విజయ గణపతి కాలనీలోని డాక్టర్ కందాల శోభారాణి గృహమునందు మొదటి యాది సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన అరుణోదయ విమలక్క మాట్లాడుతూ శోభతో తనకున్న అనుబంధం, తను విద్యార్థి దశ నుంచి ఎదుర్కొన్న సమస్యలు, సాధించిన విజయాలు, సాహితీ రచనలతో సామాజికంగా చైతన్యపరిచిన విధానాన్ని, హక్కుల సభల్లో వక్తగా తన సేవలు అద్వితీయమని కొనియాడారు. శోభక్క భౌతికంగా తమతో లేనందున జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. అనంతరం అనిశెట్టి రజిత, ప్రరవే వీరసం కళావతి, కేయూ ప్రొఫెసర్ వై.వెంకయ్య, సీఎంఎస్ అనిత, ప్రొఫెసర్ ఈసం నారాయణ, ప్రజా ఫ్రంట్ బి.రమాదేవి, డీటీఎఫ్ లింగారెడ్డి, సీఐటీయూ రామ, డీజే బాసోజు లక్ష్మీనరసింహ, కేయూ ప్రొఫెసర్ టి.శేషు మాట్లాడుతూ శోభక్క ఆశయాలను విస్తృత పరచాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే కాకతీయ విశ్వవిద్యాలయంలో బుర్ర రాములు, బాలగోపాల్ సార్ల తర్వాత అంతగా శోభక్క ఎదిగిందని యాది చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు అలాగే విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాజ్యసభలో అడుగు పెట్టడం నా అదృష్టం..!

**ఇదంతా కేసీఆర్ వల్లే సాధ్యమైంది**

**మరో అవకాశం ఇస్తే .. మళ్లీ మీ ముందుకు**

**ఎంపీ వద్దిరాజు వీడ్కోలు ఉపన్యాసం**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాజ్యసభ సభ్యుడిగా చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే పలు ఘటనల్లో భాగస్వామ్యం కావడం తన అదృష్టమని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఇదంతా సీఎం కేసీఆర్ వల్లే సాధ్యమైందన్నారు. ఆయనకు ఆజన్మాంతం రుణపడి ఉంటానన్నారు. గురువారం రాజ్యసభలో పదవీకాలం పూర్తయ్యే సభ్యులకు సభ వీడ్కోలు పలికింది. వారందరికీ చైర్మన్ జగదీప్ ధన్ ఖడ్ మాట్లాడే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ముగింపు ఉపన్యాసం ఇచ్చారు. తమ పార్టీ అధినేత కేసీఆర్ కు ధన్యవాదాలు తెలుపుతూ తన ఉపన్యాసాన్ని మొదలు పెట్టారు. సహకరించిన అప్పటి, ప్రస్తుత రాజ్యసభ చైర్మన్లు వెంకయ్య నాయుడు, జగదీప్ ధన్ ఖడ్, పార్లమెంటరి పార్టీ నేత కె.కేశవరావు, పెట్రోలియం సహజవాయువు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ రమేష్ బిధూరి తదితరులకు రవిచంద్ర కృతజ్ఞతలు చెప్పారు. సభలో ఆయన మాట్లాడుతూ.. ఇరవై నెలల తన పదవీకాలంలో అటు పాత పార్లమెంట్, ఇటు కొత్త పార్లమెంట్ భవనాల్లో కూర్చునే అవకాశం దొరకడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికలు రావడం.. అందులో ఓటు వేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అనేక దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న.. మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఇదే సభలో మా పార్టీ తరపున మాట్లాడే అవకాశం రావడం చారిత్రక సంఘటనగా భావిస్తున్నాన్నారు. సమ్మక్క- సారలమ్మ గిరిజన యూనివర్సిటీ నా హయాంలో మంజూరు కావడం మరిచిపోలేని నేపథ్యం అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న విధంగా.. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణలోని ఏదైనా ఒక సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం హామీల అమలుపై దృష్టి సారించాలని.. బీసీ రిజర్వేషన్ బిల్లును అమలు పర్చాలని.. ప్రధాని నరేంద్ర మోడిని కోరారు. కేంద్రం నుంచి నిధుల మంజూరులో రాష్ట్రానికి సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. చివరలో.. అధినేత కేసీఆర్ మళ్లీ తనను ఆశీర్వదిస్తే.. ఇదే సభలో తిరిగి అడుగిడుతానని ఆశాభావం వ్యక్తం చేశారు.

# భారత సంస్కృతికి ప్రతీక కుస్తీ

**హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**ఉత్సాహంగా రెజ్లింగ్ పోటీలు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మన దేశ వారసత్వ సంప్రదాయానికి ప్రతీక కుస్తీ పోటీలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పేర్కొన్నారు. జేఎన్ స్టేడియంలో తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అండర్-20 రాష్ట్ర స్థాయి బాలబాలికల రెజ్లింగ్ పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శక్తియుక్తుల మేళవింపుతో కూడిన క్రీడా రెజ్లింగ్ లో రాణించాలంటే ప్రణాళిక బద్ధంగా శ్రమించాలన్నారు. శారీరక దృఢత్వానికి ప్రతీక ఈ క్రీడ అన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారత త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగరవేస్తున్న అంతర్జాతీయ రెజ్లర్ల స్ఫూర్తితో మన జిల్లా, రాష్ట్ర క్రీడాకారులు విజయకేతనం ఎగరవేయాలన్నారు. జిల్లాలో ప్రతిభావంతులైన రెజ్లర్లకు కొదవలేదని వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించనున్నట్లు చెప్పారు. అనంతరం ప్రస్తుత పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. అండర్ 15 లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఆమె సర్టిఫికెట్లను అందజేసి మెడల్స్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా క్రీడల అధికారి జి.అశోక్, తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం, కోశాధికారి వై.సుధాకర్, వివిధ జిల్లాల రెజ్లింగ్ సంఘాల బాధ్యులు జైపాల్, సాయిలు, శ్రీనివాస్, రాజేందర్, సతీష్, రాజు, వంశీకృష్ణలు పాల్గొన్నారు.

# పి.లక్ష్మణ్‌పై కేసు నమోదు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** బల్దియా కమిషనర్ తో దురుసుగా వ్యవహరించిన పెరుమాండ్ల లక్ష్మణ్ పై కేసు నమోదైంది. చెరువుల పరిరక్షణ కమిటీ, సామాజిక కార్యకర్త అని చెప్పుకుంటున్న లక్ష్మణ్ ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ లో కొత్తగా ఇల్లు నిర్మించుకుంటున్న అమాయక ప్రజలను బెదిరించి పెద్ద మొత్తంలో డబ్బులు గుంజుతూ మోసం చేస్తున్నారంటూ రాత పూర్వకంగా ఫిర్యాదులు అందాయని, ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా మట్టేవాడ పోలీస్ స్టేషన్ లో ఐపీసీ 353 ప్రకారం ఎఫ్ ఐఆర్ నెం. 36/2024 నమోదు చేసినట్లు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజవ్వాన్ బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

# టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్

## కువైట్ బ్రాంచ్ కో-కన్వీనర్‌గా కళ్యాణి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎన్ ఆర్ ఐ సెల్ కువైట్ బ్రాంచ్ కో-కన్వీనర్ గా సికింద్రాబాద్ ఈసీఎల్ కు చెందిన కళ్యాణి చొప్పలను నియమిస్తూ టీపీసీసీ ఎన్ ఆర్ ఐ సెల్ చైర్మన్ డాక్టర్ బీఎం.వినోద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో కళ్యాణి చేసిన సేవలకు గుర్తింపుగా ఈ నియామకం చేశారని తెలిపారు. కళ్యాణి కుటుంబం గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నారు. కళ్యాణి భర్త శోభన్ బాబు కువైట్ దేశంలో కెమికల్ ఇంజనీర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. విదేశాల్లో వీరు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ ద్వారా ఆమె పేదలకు విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తూ అండగా నిలుస్తున్నారు. గల్ఫ్ కంట్రీస్ (జీసీసీ) లో ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ చైర్మన్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దేశంలోపాటు విదేశాల్లో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కళ్యాణి తన వంతు కృషి చేస్తున్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కూడా రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయుటకు వారి సేవలను వినియోగించుకోనున్నారు.

# 14న లక్నవరం నీరు విడుదల

**గిరిజన సాంప్రదాయాలతోనే మేడారం జాతర**

**అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు**

**ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**వరంగల్ వాయిస్, ములుగు :** గిరిజన సాంప్రదాయాల మేరకు మేడారం మహా జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. గురువారం మేడారంలోని హరిత హోటల్ సమావేశ మందిరంలో 'మీడియా ఇంటరాక్షన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ జాతరలో గిరిజన సాంప్రదాయాలు ఉట్టిపడేలా రద్దీ ప్రాంతాల్లో గిరిజన ప్రత్యేక పెయింటింగ్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జాతరలో నిరంతరం పారిశుధ్య పనులు జరిగేలా నాలుగువేల మంది పారిశుధ్య కార్మికులను అందుబాటులో ఉంచామన్నారు. వీరితోపాటు ఐటీసీ, సింగరేణి సంస్థల ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక యంత్రాల ద్వారా కూడా పారిశుధ్య పనులు చేయనున్నట్లు తెలిపారు. యానిమల్ కంపోజ్, టాయిలెట్ వేస్టేజ్ ప్రాసెసింగ్ చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. జాతరలో వేస్టేజ్ గల్ఫర్స్ సంఖ్య పెంచామన్నారు. ఆర్ డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో 14 క్లస్టర్, 279 యూనిట్స్ ద్వారా 5,532 టాయిలెట్స్ ఏర్పాటు చేశామన్నారు. నూతనంగా 230 కొత్త బోర్ వెల్స్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో జంపన్న వాగు లోతట్టు ప్రాంతాలు, రద్దీ ప్రదేశాల్లో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామన్నారు. భక్తులు స్నానమాచరించేందుకు 14 - 16 తేదీల్లో లక్నవరం సరస్సు నుంచి నీటిని విడుదల చేస్తామన్నారు. జాతరకు వచ్చే భక్తులకు వైద్యశాఖ నుంచి 30 ప్రత్యేక హెల్త్ క్యాంపులు, అంబులెన్స్ ను ఏర్పాటు చేశామని, ఆర్టీసీ మహిళ సిబ్బందికి టికెట్ కౌంటర్స్ వద్ద ప్రత్యేక వసతి సదుపాయాలు, జాతరకు వచ్చే భక్తులకు ఆరు వేల బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు.

అనంతరం జిల్లా ఎస్పీ శబరిష్ మాట్లాడుతూ పోలీస్ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు జాతరలో 14 వేల మంది పోలీస్ సిబ్బంది ఏర్పాటు చేశామని తెలిపారు. జాతరలో ప్రత్యేక ప్రణాళికల ద్వారా ట్రాఫిక్, క్రైమ్, భక్తుల రద్దీ కంట్రోల్ చేయడం జరిగిందన్నారు. వనదేవతలను తీసుకొచ్చే సమయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని రోప్ పార్టీ ద్వారా దేవతల ప్రతిష్టకు భంగం కలగకుండా క్రౌడ్ కంట్రోల్ చేయడానికి ప్రత్యేక టెక్నాలజీ ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. జాతరలో 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిశీలిస్తామని, వీఐపీ, వీవీఐపీల దర్శనం వల్ల సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అంకిత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.శ్రీజ, ఏటూరు నాగారం అదనపు ఎస్పీ సిరిషెట్టి సంకీర్త్, దేవాదాయ శాఖ అధికారి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com